క్లుప్తంగా

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించండి


డీఆర్ఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ నర్సాపూర్–ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (1728)ను అనంతపురం వరకూ పొడిగించాలన్నారు. ధర్మవరం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17216) ప్రయాణ సమయాన్ని కుదించేందకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం, గుంతకల్లు, ధర్మవరం రైల్వేస్టేషన్లల్లో వృద్ధులు, పిల్లలను దృష్టిలో ఉంచుకుని బ్యాటరీ వెహికల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అనంతపురం రైల్వేస్టేషన్‌లో అన్ని ప్లాట్ ఫారంలో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు. పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, రూరల్ కార్యదర్శి రాముడు రాయల్, నాయకులు రామాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఇంజినీర్ బాధ్యతల స్వీకరణ


లోకేష్ కుమార్

యాడికి: మండల హౌసింగ్ ఇంజనీర్‌గా లోకేష్ కుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ కుమార్ గుమ్మఘట్ట మండలానికి బదిలీ కాగా, పుట్లూరులో విధులు నిర్వహిస్తున్న లోకేష్ కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

శింగనమల ఎస్ఐగా శరత్‌చంద్ర



శింగనమల: శింగనమల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా శరత్‌చంద్ర సోమవారం బాధ్యత లు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ బదిలీ కావడంతో, గత ఆగస్టు 16న రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఎస్ఐగా ఎవరినీ నియమించలేదు. అప్పటి నుంచి మండలంలో ఇసుక అక్రమ రవాణ జోరుగా కొనసాగుతోంది. దీంతో అనంతపురంలో వీఆర్‌లో ఉన్న శరత్‌చంద్రను శింగనమల ఎస్ఐగా నియమించారు. ఆయన బాధ్యతలు తీసుకోవడంతో ఇసుక అక్రమ రవాణాకు ఎలా అడ్డుకట్ట వేస్తారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

గుత్తి ఎస్ఐగా సురేష్



గుత్తి: గుత్తి పోలీసు స్టేషన్ ఎస్ఐగా సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నబీరసూల్‌ను బొమ్మనహాల్‌కు బదిలీ చేశారు. గుంతకల్లు రూరల్ ఎస్ఐగా పని చేస్తున్న సురేష్‌ను ఇక్కడికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని పోలీసు సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లును ఎస్ఐ సురేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

చెట్లు ప్రగతికి మెట్లు

పామిడి: చెట్లు ప్రగతికి మెట్లు అని ఈఓఆర్డీ బీవీ శశికళ అన్నారు. సోమవారం మండలంలోని పాళ్యం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నీటి సంరక్షించాలన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ కే నారాయణరెడ్డి, నారాయణస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల: శింగనమలలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని సోమవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి తనిఖీ చేశారు. సీహెచ్‌సీలోని ల్యాబ్, ఎక్స్‌రే గది, ఆపరేషన్ గది, మందుల గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రోగులతో మాట్లాడారు. వైద్య సదుపాయాలు ఎలా అందుతున్నాయి, మందులు అందిస్తున్నారా, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రోగులతో సిబ్బంది ప్రవర్తన సరిగా లేదన్నారు. రాత్రిళ్లు వైద్యులు సక్రమంగా ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయని, వాటిని చూసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. వికలాంగుల ధృవీకరణ పత్రాలు అందించడంలో వైద్యులపై ఆరోపణలు వస్తున్నాయన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చిల్డ్రన్ పార్క్

- పట్టించుకోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ అధికారులు
- ఆహ్లాదం కోల్పోయిన పిల్లలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ చిల్డ్రన్ పార్క్ శిథిలావస్థకు చేరుకుంది. రైల్వే అధికారుల ఆలనాపాలనకు నోచుకోవడం లేదు. దీంతో ఒక్కపుడు ఎంతో సుందరంగా, ఆహ్లాదకరంగా ఉన్న పార్క్ అధ్వానంగా మారింది. వారాంతంలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలతో పాటు బయట పిల్లలు కూడా పార్క్‌కు వచ్చి ఆడుకునే వారు. ఇపుడు శిథిలావస్థకు చేరువైంది. అసలు ఇది పార్కేనా అనే అనుమానం కలుగుతుంది. పార్క్‌లో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు దర్శన మిస్తున్నాయి. వాటర్ ఫౌంటెయిన్, రంగుల రాట్నం, జారే బండ, నమూనా ట్రెయిన్స్, జాయింట్ వీల్ అధ్వానంగా మారడంతో పార్కు తాగుబోతులకు అడ్డాగా మారింది. వారం కిందట కురిసిన వర్షానికి పార్క్ జలమయం అయింది. ఇప్పటికీ పార్క్‌లో వర్షం నీరు నిల్వ ఉంది. రైల్వేకు ఆదాయం వస్తున్నప్పటికీ పార్క్‌ను కనీసం మెయింటనెన్స్ చేయడం లేదు. రైల్వే అధికారులు స్పందించి పార్క్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు, పిల్లలు కోరుతున్నారు.


అధ్వానంగా చిన్న రంగుల రాట్నం



రైల్వే ఇన్‌స్టిట్యూట్ చిల్డ్రన్స్ పార్క్ ముఖద్వారం


పార్క్‌లో వర్షం నీరు నిలిచిన దృశ్యం


శిథిలావస్థలో ఉన్న వాటర్ ఫౌంటెయిన్


పార్క్ ఆవరణలో మద్యం బాటిళ్లు కుప్పగా ఉన్న దృశ్యం

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్ట్‌లు దక్కించుకుని, నేటికీ పనులను ప్రారంభించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కృపాకర్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 14, 15వ ఆర్థిక సంఘం, గడప గడప, జనరల్ నిధులకు సంబంధించి వార్డుల్లో పనులు చేసేందుకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకున్నప్పటికీ పనులు చేయకపోవడంతో అభివృద్ధి అటకెక్కిందన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. పనులు చేయని వారికి నోటీసులిచ్చి తదుపరి చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ భవాని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ స్థలాల రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎస్.లావణ్య, కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక


గుత్తిలో ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నందిని

గుత్తి: అనంతపురంలో ఈ నెల 28న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో గుత్తికి చెందిన పలువురు విద్యార్థులు వివిధ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు గుత్తి బాలికల ఉన్నత పాఠశాల పీడీ సరోజ తెలిపారు. పెంటాథ్లాన్ అండర్–17లో స్వాతి, నెట్ బాల్ అండర్–17లో సింధు, ఫెన్సింగ్ అండర్–19లో అభివర్షిత, మహిత, అండర్–17లో–కళ్యాణి, భాను ప్రియ, అండర్–14లో ఆశా, వైశాలి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం ఉషారాణి, పీడీలు సరోజ, శ్యామల, శకుంతల, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగా పోటీల్లో..

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కస్తూరిబా జనరల్ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నందిని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ మునెమ్మ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–19 విభాగం లో 32 మంది విద్యార్థులు పాల్గొనగా నందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో పీఈటీ చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడాకారిణిని అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ నారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో శింగనమల నియోజక వర్గస్థాయి స్కూల్ గేం ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. లాంగ్ జంప్‌లో పాఠశాలకు చెందిన అలేఖ్య, ధనుంజయ, డిస్క్ త్రోలో దశ్మిత్, చెస్‌లో సంగీత, కబడ్డీలో థామస్, జయక్రిష్ణ, చరణ్, ఖోఖోలో ధనుంజయ, థామస్, యశ్వంత్, కుళ్లాయప్ప, ధనుష్, స్పందన, అలేఖ్య, అమృత, గాయత్రి, అమృత, వాసంతి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీడీ నిరంజన్‌రెడ్డి, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.


తలసేమియా విద్యార్థికి దాతల చేయూత

గార్లదిన్నె: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గార్లదిన్నె మండలం పాత కల్లూరుకు చెందిన సురేంద్ర, సుజాత దంపతుల కుమారుడు శ్రీకాంత్‌కు దాతలు అండగా నిలిచారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌కు ఆపరేషన్ అత్యవసరమని అక్కడి వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.18 లక్షల వరకు ఖర్చు వస్తుందని వైద్యులు తెలపడంతో చేతిలో చిల్లిగవ్వలేని నిరుపేద కుటుంబ దీనస్థితిపై ఆస్పత్రి వద్దు... బడికి వెళ్తానమ్మా శీర్షికన ఆదివారం సాక్షిలో వెలువడిన కథనంపై పలువురు దాతలు స్పందించారు. రెండో రోజు సోమవారం పలువురు దాతలు... బాధిత విద్యార్థి కుటుంబసభ్యుల ఫోన్ పే 90145 15056, 81067 51483 నంబర్లకు రూ.11 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా ఇప్పటి వరకూ రూ.28 వేలు ఆర్థిక సాయం అందడంతో వైద్యఖర్చుల కోసం వినియోగిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎంపిక

గుత్తి: పట్టణంలోని సీపీఎం కార్యాలయ ఆవరణలో సోమవారం గుత్తి పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ధనార్జున మరో ఏడుగురు ఆఫీస్ బేరర్లు, 21 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నాగార్జున



గుంతకల్లుటౌన్: ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గుంతకల్లుకు చెందిన నాగార్జున కర్ణాటకం ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో చెస్ అసోసియేషన్ కార్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ హిందీ మాట్లాడాలి


హిందీ భాషా దినోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

గార్లదిన్నె: మండలంలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ(ట్రాక్టర్ నగర్)లో సోమవారం హిందీ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ట్రాక్టర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందేడే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాక్టర్ నగర్‌లో 15 రోజుల నుంచి హిందీ భాషా పక్వాడా సమారోహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రాక్టర్ నగర్‌లో పనిచేసే సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరూ హిందీ భాష మాట్లాడాలన్నారు. అలాగే హిందీపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అనంతరం హిందీ భాషపై కార్యాలయ సిబ్బందికి వ్యాసరచన, వ్యాకరణం, పాటల పోటీలు, హిందీ భాషన్ వంటి పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హిందీ భాష కో ఆర్డినేటర్ సుధీర్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి మూలవిరాట్ చోరీ


మూలవిరాట్‌ను పెకలించడంతో బోసిపోయిన గర్భగుడి

పామిడి: స్థానిక పెన్నానదిలో వెలసిన సీతారామలక్ష్మణ సమేత భక్తాంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగినట్లుగా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లిన సమయంలో అర్చకుడు అమరనాథ్ గుర్తించి విషయాన్ని ఆలయ ధర్మకర్తలు ఎ శ్రీనివాసులు, ఎ షణ్ముఖ కుమార్‌కు తెలిపారు. ఈ సందర్భంగా షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ.. 1938లో తమ పూర్వీకుడు మోటార్ బాలన్న.. పెన్నానదిలో స్నానం ఆచరిస్తున్న సమయంలో లభించిన సీతారామలక్ష్మణ విగ్రహాలను అక్కడే ప్రతిష్టించి ఓ ఆలయాన్ని నిర్మించారని, దీని ఎదురుగానే మరో ఆలయాన్ని నిర్మించి భక్తాంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ప్రతిష్టించారని గుర్తు చేశారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చౌడమ్మ గుడిలో చోరీ

శింగనమల: మండలంలోని గురుగుంట్ల గ్రామ శివారులో ఉన్న చౌడమ్మ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. చౌడమ్మ విగ్రహానికి ఉన్న వెండి కన్నులు, వెండి మీసాలు, బంగారు తాళిబొట్టుతో పాటు హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న భక్తులు సమర్పించిన నగదు, కానుకలను అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం పూజలు చేయడానికి వెళ్లిన అర్చకుడు వెంకటరమణ చోరీ విషయాన్ని గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తపాలా శాఖలో కిరికిరి

- బాధ్యతలు అప్పగించకుండానే రిటైర్డ్ అయిన ఉద్యోగి

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖలో అంతా ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ఓ ఉద్యోగి మరో ఉద్యోగికి బాధ్యతలు అప్పగించకుండానే ఉద్యోగ విరమణ చేయడం దుమారం రేపుతోంది. తపాలా శాఖ ఉద్యోగుల కథనం ప్రకారం.. శింగనమల సబ్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో అనంతపురం డివిజనల్ కార్యాలయంలోని పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పవన్ కుమార్‌రెడ్డిని నియమించారు. ఆయన పది రోజుల కిందట అనంతపురంలో రిలీవ్ కూడా అయ్యారు. అయితే శింగనమలలో మాత్రం జాయిన్ కాకుండా కాలయాపన చేశారు. వెంకటేశ్వర్లు రిటైర్డ్ కావడానికి ముందే పవన్ కుమార్‌రెడ్డికి అన్నీ రికార్డులు, ఇతర బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. అందుకు ఆయన సిద్ధంగా ఉన్నా పవన్ కుమార్‌రెడ్డి సిద్ధంగా లేకపోయారని తెలుస్తోంది. దీంతో బాధ్యతలు అప్పగించకుండానే వెంకటేశ్వర్లు రిటైర్డ్ అయిపోయారు.

శింగనమల వెళ్లని పవన్..

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) డెవలప్‌మెంట్ ఆఫీసర్ పవన్‌కుమార్‌రెడ్డి అనంతపురంలో సుమారు నాలుగేళ్లగా పని చేస్తున్నారు. అనంతపురంలోని అరవింద్‌నగర్ పోస్ట్ ఆఫీస్‌లో ఎస్‌పీఎం పోస్టు నెల కిందట ఖాళీ ఏర్పడింది. అక్కడ పని చేస్తున్న సారా ప్రీతిక ఓల్డ్‌టౌన్‌కు బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో పవన్ కుమార్‌రెడ్డి శింగనమల వెళ్లకుండా అరవింద నగర్‌లోనే పోస్టింగ్ తెచ్చుకోవాలని భావించి చక్రం తిప్పారు. అందుకు డివిజనల్ కార్యాలయ ముఖ్య అధికారులు అంగీకరించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు చర్చ నడుస్తోంది.

ఏఎస్పీ ఉమామహేశ్వర్ ఏమన్నారంటే..

ఇదే అంశాన్ని తపాలా ఏఎస్పీ ఉమామహేశ్వర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. శింగనమల సబ్‌పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వర్లు రిటైర్డ్ అయిన విషయం నిజమే. ఆయన స్థానంలో పవన్ కుమార్‌రెడ్డిని నియమించిది వాస్తవమే. పవన్ పది రోజుల కిందటే రిలీవ్ అయ్యారు కూడా.. అయితే ఆయన ఇంత వరకు జాయిన్ కాలేదు. వెంకటేశ్వర్లు నుంచి చార్జ్ తీసుకోవాల్సి ఉన్నింది. పవన్ శింగనమలకు వెళ్తారా లేక అరవిందనగర్‌కు మారుతారా అనే విషయం ఇంకో గంట టైం ఇస్తే చెప్పగలనంటూ సమాధానమిచ్చారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు.పోలీసుల వివరాల మేరకు.. పాత కల్లూరుకు చెందిన పుల్లయ్య(49) వెంకటేశ్వర రైస్ మిల్లు సమీపంలో పాత కల్లూరు నుంచి అగ్రహారం వైపు వెళ్లే రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు ఢీకొంది. స్థానికులు గమనించి అతడిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ అజాయ్ సల్మాన్‌పై కేసు నమోదు చేసినట్లు జమేదార్ చిరంజీవి తెలిపారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

పెద్దవడుగూరు: చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల నాయకులు నారాయణ, సూర్యనారాయణరెడ్డి, వెంకట్రాముడుయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పవర్ లూమ్స్ వల్ల చేనేతల జీవితాలు చిద్రమవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకునేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.36 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఓబిరెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, ఓం నారాయణ, ఆదినారాయణ, అల్లాబకాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'రేపు మాంసం విక్రయిస్తే చర్యలు'

గుత్తి: గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న మాంసం విక్రయాలను నిషేధించాం.ఎవరైనా మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మా ఆదేశాలు ధిక్కరించి మాంసం, చికెన్ విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా, ఎవరైనా మాంసం, చికెన్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రపంచ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా రెండు రోజుల కిందట విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులతో పాటు అతిథులు సామాజిక కార్యకర్త జెమిని సురేష్, హెచ్ఎం సీతా రామాంజనేయులు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

3 నుంచి సేవాగఢ్‌లో నవరాత్రి ఉత్సవాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో అక్టోబర్ 3 నుంచి మాతా జగదాంబ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్ తెలిపారు. సోమవారం సేవాగఢ్‌లోని ట్రస్టు కార్యాలయంలో కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవాల పోస్టర్లు విడదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజల వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో మొదటి రోజు బాలా త్రిపుర సుందరిదేవీ అలంకరణలో మాతా జగదాంబ భక్తులకు దర్శనమిస్తారన్నారు. చివరి రోజు రాజరాజేశ్వరి అలంకరణలో కటాక్షిస్తారన్నారు. భక్తులు, ప్రజలు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోశాధికారి బాలా నాయక్, సభ్యులు రామచంద్ర నాయక్, రంగనాయక్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు


ఈశ్వరమ్మను సన్మానిస్తున్న డాక్టర్ స్వాతి లక్ష్మి, వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని మండల డాక్టర్ స్వాతి లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి: దసరా పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సిబ్బందికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, సర్పంచు అనూరాధ సోమవారం సాయంత్రం దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు దుస్తులు, కొబ్బరినూనె, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, జూనియర్ సహాయకులు శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్, నాయకులు పందు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ, ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఏసీడీపీఓ నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు.

ఫొటోగ్రాఫర్ల కమిటీ ఎంపిక


కల్లూరులో సమావేశమైన ఫొటో,వీడియో గ్రాఫర్లు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు మంజూనాథ ఫంక్షన్ హాల్లో సోమవారం ఫొటో,వీడియో గ్రాఫర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గార్లదిన్నె, కల్లూరు, పామిడి, తరిమెల గ్రామాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు సమావేశానికి హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా చెక్కా సురేష్, వైస్ ప్రెసిడెంట్‌గా వీరా, సెక్రెటరీగా సుధాకర్, జాయింట్ సెక్రెటరీగా మహేష్, ట్రెజరర్‌గా లోకేష్ ఎంపికయ్యారు.